పత్తి క్వింటాల్‌కు రూ.6678

పెద్దపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి క్వింటాల్‌కు అత్యధికంగా రూ.6678 ధర పలికింది. మార్కెట్‌కు 1468 సంచుల్లో 406 మంది రైతులు 1321. 20 క్వింటాల్‌ల పత్తిని తీసుకువచ్చారు. అత్యధికంగా క్వింటాల్‌రూ.6678లు పలుకగా అత్య ల్పంగా రూ.5256 పలికింది. మోడల్ ధర రూ.6321గా ఉంది. గిట్టుబాటు ధరలు దక్కకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి ప్రారంభం

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో సోమవారం అర్ధరాత్రి తరువాత యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. సోమవారం ఉదయం యూరియా ప్లాంట్‌లో ప్లాంజ్ లీకేజీతో ఉత్పత్తి నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం ప్లాంట్‌ను తిరిగి ఉత్పత్తి దశలో పెట్టారు. యూరియా ఉత్పత్తి నిలిచిపోయినా సోమవారం అమ్మోనియా ఉత్పత్తి యథావిధిగా కొనసాగింది. ఉత్పత్తి అయిన అమ్మోనియాను స్టోరేజ్ ట్యాంకుల్లో నిల్వ చేశారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

● కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి మైనారిటీ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ నాయకత్వంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా పని చేశారని తెలిపారు. ఆయన జయంతి పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆయన హిందీ, అరబిక్, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో పండితుడని, 11 ఏళ్ల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. ప్రతి పేదవాడికి విద్య అందేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో మైనారిటీ విద్యపై దృష్టి పెడుతూ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ అన్ని కులాలు, వర్గాల వారు కలిసి చదువుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ శాఖ అధికారి రంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



కులాంతర వివాహాలకు ప్రోత్సాహమేది?

- నాలుగేళ్లుగా అందని ఆర్థిక సహాయం
- వేచి చూస్తున్న ఎస్సీ, బీసీ దరఖాస్తుదారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కులాంతర వివాహాలు చేసుకునే వారికి ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల ద్వారా అందించాల్సిన ఆర్థిక సహాయం కోసం నాలుగేళ్లుగా దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు. ఎప్పుడు ఆర్థిక సహాయం అందిస్తారని ఆయా కార్యాలయాల్లో వాకబు చేస్తున్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ఇచ్చే ఆర్థికసాయం తక్కువే అయినా ఆయా శాఖల నుంచి ప్రభుత్వం బడ్జెట్‌ను విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలు ఈ పథకం ఉన్నట్లా, లేనట్లా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.ఎప్పటికప్పుడు ప్రభుత్వం ఈ పథకం ద్వారా నిధులను విడుదల చేయకపోవడంతో చాలామంది దరఖాస్తు కూడా చేసుకోవడం లేదు. జిల్లాలో ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా 158 జంటలు, బీసీ సంక్షేమ శాఖ ద్వారా 23 జంటలు దరఖాస్తు చేసుకొని ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తు న్నారు. మొక్కుబడిగా ప్రభుత్వం ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్ర అవతర దినోత్సవం రోజున జూన్ 2న, స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న మూడు, నాలుగు జంటలకు ఆర్థిక సహాయాన్ని అందించి చేతులు దులుపుకుంటున్నారు. నాలుగేళ్లుగా దరఖాస్తు చేసుకొని వేచి చూస్తున్న వారికి ఆర్థిక సహాయం అందడం లేదు.

● 1980లో పథకం ఆరంభం

కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1980లో ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా పథకాన్ని ఆరంభించారు. ఈ పథకం ద్వారా ప్రేమించి పెళ్లి చేసుకునే వారిలో ఎవరో ఒకరు ఎస్సీ కులానికి చెందిన వారై ఉండాలి. పెళ్లి చేసుకున్న ఏడాదిలోగా ధ్రువపత్రాలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని జిల్లా అధికారులు పరిశీలించి విచారణ జరుపుతారు. కులాంతర వివాహం చేసుకున్నారని నిర్ధా రణకు వచ్చిన తరువాత ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దర

(మిగతా 8వ పేజీలో)

● నాలుగేళ్లుగా విడుదల కాని బడ్జెట్

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయం ఆయా దంపతులకు ఉపయోగపడే అవకా శాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం నిధులను విడుదల చేయడం లేదని దళిత సంఘాల నేతలు వాపోతు న్నారు. దరఖాస్తుదారులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఎప్పుడు నిధులు వస్తాయా అని అధికా రులు, సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్నారు. బడ్జెట్ ఎప్పుడు వస్తుందో తెలియదంటూ వారు సమాధానం చెబుతుండటంతో అసలు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందా లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని సకాలంలో విడుదల చేయకపోవడంతో అనేకమంది దరఖాస్తు చేసుకునేందుకు సైతం ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజే యాలని ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న అధికారులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జాతీయ యువజన ఉత్సవాలను అదనపు కలెక్టర్ దాసరి వేణు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పులమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఫోక్ డ్యాన్స్, సాంగ్స్, పెయింటింగ్, సైన్స్‌మేళా, పోయేట్రీ, స్టోరీ రైటింగ్ అంశాలపై పోటీలు జరిగాయి. న్యాయనిర్ణేతలుగా జాతీయ యువజన అవార్డు గ్రహీతలు ఈదునూరి శంకర్, కొండ రవి, యువజన నాయకులు కన్నూరి ఆంజనేయులు పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతలను సన్మానించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, జిల్లా యువజన, క్రీడా అధికారి సురేష్‌లు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి కల్పన, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, పేఅండ్ అకౌంట్ ఆఫీసర్ ప్రభాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందించారు. విజేతలుగా గెలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పేట అధ్యక్షుడు వేల్పుల సురేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గా ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాలకు సుస్తి..

- పైలెట్లు, టెక్నీషియన్ల కొరతతో వాహనాల షట్‌డౌన్
- రాత్రి వేళల్లో ఘటన స్థలానికి చేరుకోని వాహనాలు
- ఇబ్బంది పడుతున్న బాధితులు





అంబులెన్స్ రాకపోవడంతో బాధితురాలిని ఆటోలో ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి(ఫైల్)

కళ్యాణ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 108వాహనాలకు సుస్తి చేసింది. నిత్యం ఏదో ఒక సంఘటన జరిగి బాధితులు ఇబ్బందులు పడుతుంటే సకాలంలో వాహనాలు రాక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో ఒక్క ఫోన్‌కాల్ చేస్తే వాహనాలు ఘటన స్థలానికి వచ్చేవి. ఈ మధ్య కాలంలో ఫోన్ చేసినా వాహనాలు ఇక్కడలేవు, సమయం పడుతుంది, బండి దూరంలో ఉందంటూ సమాధానాలు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాల ఎదుట ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకోగా వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి 108వాహనానికి ఫోన్‌చేస్తే వాహనం కమాన్‌పూర్‌లో ఉందంటూ సమాధానం చెప్పారు. దీంతో సీఐ బాధిత మహిళను ఆటోలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అరగంట తరువాత 108 వాహనం వచ్చింది. ఇలా రోజూ బాధితులకు సమాధానం ఇలానే చెబుతున్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, ఏదో ఒక ఘటనలు జరిగే జిల్లాలో 108 సేవలు సకాలంలో అందకపోవడంతో తీవ్రఇబ్బందులు పడాల్సి వస్తుంది.

● జిల్లాలో 9వాహనాలు

పెద్దపల్లి జిల్లాలో తొమ్మిది 108 వాహనాలు ఉన్నాయి. ఇందులో పెద్దపల్లి, గోదావరిఖని, బసంత్ నగర్, సుల్తానాబాద్, ఓదెల, ధర్మారం, మంథని, కమాన్‌పూర్, అంత ర్గాంలో సర్వీసులు ఉన్నాయి. ఇందులో పని చేయడానికి సిబ్బంది కొరత ఏర్పడుతుంది. రెండు వాహనా లకు రోజూ ఆరుగురు చొప్పున పని చేయాల్సి ఉండగా పైలెట్లు, టెక్నీషియ న్లు, అటెండర్ల కొరత ఉండడంతో వాహనాలు సక్రమంగా తిరగడం లేదు. సిబ్బంది ఎవరైనా అందుబాటులో లేకపోతే వాహనాలను ఆసుపత్రి కేంద్రాల్లో వాహనాలను నిలిపి ఉంచుతున్నారు.

● రాత్రి వేళల్లో నాలుగు అంబులెన్స్ షట్‌డౌన్

జిల్లాలో తొమ్మిది అంబులెన్స్‌లు ఉండగా రోజూ రాత్రి నాలుగు అంబులెన్స్‌లను సిబ్బంది లేరంటూ నడపడం లేదు. రాత్రి 7.30గంటల నుంచి ఉదయం 7.30గంటల వరకు వాహనాలను తీయడం లేదు. ఎవరైనా బాధితులు ఫోన్ చేస్తే వాహనం ఫలానా చోట ఉంది, వచ్చే వరకు సమయం పడుతుందంటూ సమాధానం చెబుతున్నారు. స్పెషల్ ఆపరేషన్ పేరిట వాహనాలు ఏ రూట్‌లో ప్రయాణిస్తున్నాయో తెలియకుండా చేస్తున్నారు. ఇలా నిత్యం రోజూ నాలుగు అంబులెన్స్‌లు షట్‌డౌన్ పేరిట నిలిపివేయడం జిల్లా మొత్తంలో ఐదు అంబులెన్స్‌లు మాత్రమే పని చేస్తున్నాయి.అత్యవసర సమయాల్లో గోదావరిఖని ప్ర భుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి రెఫరల్ చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌లు కమాన్‌పూర్, అంతర్గాం, బసంత్‌నగర్ నుంచి వాహనాలు వచ్చేవరకు సమయం పడుతుంది. దీంతో కొన్నిసందర్భాల్లో బాధితులు మృత్యువాత పడాల్సి వస్తుంది.

● జనరల్ ఆసుపత్రిలో ఒకటే అంబులెన్స్

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్ర మలు, గనులు ఉండడంతో ఇక్కడ నిత్యం ప్రమా దాలు జరుగుతూ ఉంటాయి. దీనికి తగ్గట్టు 108 వాహనాలు లేకపోవడంతో సమయానికి వాహనాలు రాక ప్రమాదంలో గాయపడిన వారు నరకయా తనను అనుభవిస్తూ ప్రైవేట్ అంబులెన్స్‌లను ఆశ్రయించి ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా ఇక్కడ 108వాహనాల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.

నేడు గోదావరి మహాహారతి



గోదావరి వద్ద పరిశీలిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సమ్మక్క - సారలమ్మ వద్ద ఉన్న గోదావరి తీరం వద్ద బుధవారం నిర్వహించనున్న మహాహారతి కార్యక్రమానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు మహా హరతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ చెప్పారు. మంగళవారం మహాహారతి జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోదావరి తీరంలో 14సంవత్సరాలుగా మహాహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు, బుధవారం జరిగే కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు తరలిరావాలని సూచించారు. మంజుల, వెంకన్న, వీరేశం, రమేష్, శ్రావణ్‌గౌడ్ పాల్గొన్నారు.

రామగుండంలో ఆధునిక నాలాలు

- చెత్త వేయకుండా పైకప్పు పెన్సింగ్
- పూడికల నివారణకు చర్యలు...



నాలాపై పైకప్పు కోసం వేసి రెయిలింగ్

కోల్‌సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నాలాలను ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్నారు. నాలాల్లో చెత్త వేయకుండా నాలాల పైకప్పు పెన్సింగ్ వేస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధి లో ఆధునికీకరిస్తున్న అన్నీ ప్రధాన నాలాల్లో ఇదే విధా నాన్ని కొనసాగిస్తున్నారు. తద్వారా నాలాల పూడిక తీతకు యేటా రూ.50లక్షలకుపైగా నిధులను ఆదా చేసేందుకు చర్యలు చేపట్టారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని ప్రాంతాల్లో ప్రధాన నాలాలను ఆధునీకరిస్తున్నారు. సుమారు 50 ఏళ్ల పాటు మన్నికయ్యే విధంగా స్టీల్, కాంక్రీట్‌తో సీసీ డ్రైన్లను నిర్మిస్తున్నారు. గోదావరిఖని ఇందిరానగర్ నుంచి మార్కండేయకాలనీ, జీఎం కాలనీ రాజీవ్ రహ దారి నుంచి ఐటీ కాలనీ మీదుగా మెడికల్ కళాశాల, రాజీవ్ రహదారి నుంచి మెడికల్ కళాశాల మీదుగా సప్తగిరికాలనీ వరకు ఈ డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. ఈ డ్రైన్లలో ఇక నుంచి ప్రజలు చెత్త వేయకుండా నివా రించేందుకు డ్రైన్ల పైకప్పునకు పెన్సింగ్ వేస్తున్నారు. ఇందుకు గాను డ్రైన్ల నిర్మాణంలోనే పెనింగ్ వేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. మొదటి దశలో స్థానిక ఇంది రానగర్‌లోని ఆర్ఎఫ్‌సీఐ అవుట్‌లేట్ నుంచి అడ్డగుంట పల్లి ఎఫ్‌సీఐ రోడ్డు వరకు నాలాకు పైకప్పు వేస్తున్నారు. ఇప్పటికే ఫ్యాబ్రికేషన్ పూర్తి చేసి రెండు రోజులుగా పెన్సింగ్ వేస్తున్నారు. ఈ విధానం ద్వారా డ్రైన్‌లలో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా నివారించడం, డ్రైనేజీ నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడడం, పూడిక తీత అవసరాలు తక్కువగా ఉండే పరిస్థితులు ఉంటాయని కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే గాలి ద్వారా చెత్తచెదారం, కవర్లు పడకుండా నివారించవచ్చు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలో యేటా నాలాల పూడిక తీతకే రూ.50లక్షల నుంచి రూ.1కోటి వెచ్చించేవారు. ఈ విధానం ద్వారా నాలాలో చెత్త తగ్గడంతో పాటు స్థానికులే చెత్త వేయకుండా అడ్డుకునే అవకాశం ఉంది.

నగరమంతా ఈ విధానానే అమలు చేస్తాం...

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



రామగుండం నగరంలో పారిశుధ్యం, ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నాం. దీనిలో భాగంగా నాలాల ఆధునికీకరణ చేపట్టాం. పలు నాలాలను టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఆధునీకరించి పైకప్పు పెన్సింగ్ వేస్తున్నాం. అలాగే అమృత్ నిధులతో చేపట్టనున్న నాలాలను బాక్స్ టైపులో నిర్మించేలా చర్యలు చేపడుతున్నాం. తద్వారా నాలాల్లో పూడిక తగ్గి స్థానికులకు దుర్వాసన రాదు.

పోలీసులకు శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యం



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణలో శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. మంగళవారం పోలీస్ హెడ్ క్వార్టర్‌లో సిబ్బందికి వ్యక్తిగత భద్రత, స్వీయ క్రమశిక్షణ, ప్రవర్తన నియామవళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతత, సహనం పాటించడం, సహచరుల మధ్య పరస్పర గౌరవం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలువాలంటే వ్యక్తిగత స్థాయిలో క్రమశిక్షణ, ప్రవర్తన, ప్రమాణాలు అవసరమన్నారు మానసిక బలాన్ని పెంపొందించే మార్గదర్శకాలు, సిబ్బంది మధ్య పరస్పర సహకారం, సేవా స్ఫూర్తి, వ్యక్తిగత జీవన శైలిపై అవగాహన కల్పించారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్, సైకాలజిస్ట్ శ్రీనివాస్, రామగుండం ఎంవీఐ సంతోష్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రగౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఆర్ఐ దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడును నిరసిస్తూ బీజేపీ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ, ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలన్నారు. నాయకులు శిలారపు పర్వతాలు, తంగేడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, ఈర్ల శంకర్ పాల్గొన్నారు

రైతులకు పరిహారం చెల్లించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం



కొలనూర్ లో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఓదెల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తుఫాను వల్ల పంటలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. కొలనూర్‌లో మీస అర్జున్ రావు, గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని, కేంద్రాలలో రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తేమ శాతంతో పని లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ఓదెలతోపాటు సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. సర్వే నిర్వహించి వరి ఎకరానికి రూ.35 వేలు, పత్తి పంటకు రూ.50 వేల పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సౌధర మహేందర్, కునారపు రేణుక దేవి, పుల్ల సదయ్య, రాగిడి శ్రీనివాసరెడ్డి, రంజిత్ రెడ్డి, అనిల్ రావు,చర్లపల్లి రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ హక్కు కొనసాగించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు వారసత్వ హక్కు కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వారసత్వ హక్కును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులకు అనారోగ్యం బారిన పడిన, 60 సంవత్సరాలు పూర్తయిన, అకాల మరణం చెందిన వారి కుటుంబ సభ్యులకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో ఉద్యోగం కల్పించే విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మూడు నెలల్లో ఐదుగురు మున్సిపల్ కార్మికులు అనారోగ్యంతో చనిపోయారని, వారి స్థానంలో కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి మున్సిపల్ ప్రధాన కార్యదర్శి బొంకూరి సాగర్, నాయకులు మద్దెల రాజయ్య, బొంకురి శంకర్, చింతల మరియా, ఆరేపల్లి ప్రమీల, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME
★ BANDARI LAVANYA W/O. KANAKAIAH HAVE CHANGED MY NAME AS "DASARI SHYLAJA", W/O. BANDARI KANAKAIAH R/O. AREPALLY (V), KARIMNAGAR RURAL MANDAL, KARIMNAGAR DISTRICT.
AJK-17430

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, దట్ట పత్రిక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర : 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

ఫుడ్ పాయిజన్‌పై విచారణ

- పాడైన కోడిగుడ్లు, నిత్యం పచ్చిపులుసు
- వెల్లడించిన విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో సోమవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై తహసీల్దార్ వెంకట్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల సమక్షంలో మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇబ్బందులను వివరించారు. తక్కువ భోజనం పెడ్తున్నారని, రెండోసారి వెళ్తే ఇంకా ఎంత తింటారు? మిగతా వారికి సరిపోవద్దా? అంటారని పేర్కొన్నారు. నిత్యం పలుచటి పప్పు, ఏ కర్రీలోకైనా పచ్చి పులుసు, నీళ్లు పోసుకొని తిన్నట్లుగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన కోడిగుడ్లు పెడుతున్నారని, వాసన వస్తున్నాయని చెప్పినా పట్టించుకోరని తహసీల్దార్ ఎదుట వాపోయారు. పావుకిలో పప్పుతో పలుచటి నీళ్ల లాంటి పప్పు, పచ్చి పులుసు, నాలుగు కిలోల బియ్యం, ఒక్క ఉల్లిగడ్డతో 70మంది విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వండి పెట్టారని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ చెప్పడం, అలాంటిది ఏం లేదని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పరస్పరం విమర్శించుకోవడం చూసి అక్కడున్న అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి తీసుకున్న స్టేట్‌మెంట్‌ను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ లిపారు. ఆహార పదార్థాల నుంచి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్‌రెడ్డి శాంపిల్స్ సేకరించారు. రిపోర్టు వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.

తపాలా బీమాతో ధీమా

- తక్కువ ప్రీమియం
- ఎక్కువ ప్రయోజనాలు
- ఆసక్తి చూపుతున్న యువత



భగత్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నమ్మకం.. భద్రత... అనే ముద్ర వేసుకున్న తపాలా శాఖ ప్రజలకు మరింత భద్రత కోసం తపాలా జీవిత బీమా పాలసీలను అందిస్తున్నది. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ లభించే విధంగా బీమా పాలసీలను రూపొందించారు. తపాలా జీవిత బీమాతో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి పరిహారం అందుతుంది. ఈ తరుణంలో తపాలా బీమా పాలసీలపై యువత ఎక్కు వగా ఆసక్తి చూపుతుండటం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తపాలా శాఖ జీవిత బీమా పాలసీ లను అమలు చేస్తున్నది. మొదట్లో ఉద్యోగులకు మాత్రమే అందుబాటులో ఉన్న జీవిత బీమా పాలసీలను ఆ తరువాత క్రమంగా గ్రాడ్యుయేట్‌లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉద్యోగులు, గ్రాడ్యుయేట్‌లకు (పిఎల్‌ఐ) సు రక్ష, సువిధ, సుమంగల్, సంతోష్, యుగల్ సరక్ష, జీవిత బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం (ఆర్పీఎల్‌ఐ) గ్రామ సురక్ష, గ్రామ సంతోష్, గ్రామ సువిధ, గ్రామ సుమంగల్, గ్రామ ప్రియ అందుబాటులో ఉన్నాయి. పిల్లల కోసం చిల్డ్రన్ పాలసీ కూడా అమలులో ఉంది. 19 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మధ్య ఉన్న వారు ఈ తపాలా జీవిత బీమా పాలసీలకు అర్హులు. ప్రతి వ్యక్తి పీఎల్‌ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) అయితే 50 లక్షలు, ఆర్పీఎల్‌ఐ (రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) అయితే 10 లక్షలు ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం ఉంది. ప్రీమియంపై ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. నామినిని మార్చుకునే వెసలుబాటు ఉండగా, పోస్టాఫీసులకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే సదుపాయం ఉంది. ఇలా అనేక ఫీచర్లతో తపాలా శాఖ జీవిత బీమా పాలసీలను అమలు చేస్తు న్నది. జీవిత బీమా పాలసీలు అన్ని తపాల శాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

బీమాపై స్పెషల్ డ్రైవ్

- తపాల శాఖ ఎస్పీ కె శివాజీ



తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీమా పాలసీలను ప్రజలకు చేరువ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము. ప్రజలను ఎక్కువ సంఖ్యలో తపాల జీవిత బీమాలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

పాఠశాలలో గడ్డిమందు తాగిన విద్యార్థి

● ఆస్పత్రిలో చేర్పించిన ఉపాధ్యాయులు

గన్నేరువరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బోయిని సాయికుమార్ అనే విద్యార్థి మంగళవారం తరగతి గదిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రుల వివరాల ప్రకారం. గత శుక్రవారం సాయికుమార్ మృతి చెందిన పామును పాఠశాలలోని తరగతి గదికి తీసుకొచ్చి తోటి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థిని మందలించి తల్లిదండ్రులను తీసుకురావాలని ఆదేశించారు. దీంతో శని, ఆదివారం సెలవు ఉండడంతో ఇంట్లో ఈ విషయాన్ని చెప్పలేదు. సోమవారం సైతం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన సాయికుమార్ తరగతి గదిలో గడ్డిమందు తాగాడు. వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థి తండ్రి బోయిని చంద్రయ్యకు సమాచారం అందించి అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతానికి విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నా 24 గంటలు గడిస్తేనే ప్రాణాపాయం తప్పుతుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై పాఠశాల హెచ్‌ఎం రామయ్యను వివరణ కోరగా సాయికుమార్ పాఠశాలలో ఆకతాయి పనులు చేస్తూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తండ్రిని పాఠశాలకు పిలిపించి పరిస్థితి వివరించామని తెలిపారు. దీంతో తన తండ్రి దండిస్తాడేమోనన్న భయంతో గడ్డిమందు తాగినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, విచారణ చేపడతామని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు కింద పడడంతో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధుల్లో భాగంగా ప్రతాప్ ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ నుంచి వెళ్తుండగా కేసీ క్యాంపు వద్ద ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన మడ్డి నాగరాజుగౌడ్ మంగళవారం ఈత చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. గ్రామశివారులో ఈత చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదశాత్తు నిచ్చెన జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మందికి జరిమానా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి జిల్లా రెండో తరగతి జ్యుడీషియల్ న్యాయమూర్తి జయశ్రీ జరిమానా విధించారని మంగళవారం ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించగా 27 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని పేర్కొన్నారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా న్యాయస్థానంలో హాజరుపరిచామని చెప్పారు. 27 మందికి మొత్తం 69.5 వేల జరిమానా విధించారని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

కోనరావుపేట మండలంలో ఎనమిది మందికి..

కోనరావుపేట : మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందిని రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట మంగళవారం ప్రవేశపెట్టగా 14 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

పొగతో విద్యార్థినులకు అస్వస్థత


ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చెత్త తగలబెట్టగా వెలువడిన పొగతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటనతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. జిల్లా కలెక్టర్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో పాఠశాల ఆవరణలోని చెత్తను తగులబెట్టగా, అక్కడే ఉన్న రెగ్జిన్ కవర్లు, ఇతర పాత సామగ్రిని మంటల్లో వేశారు. అదే సమయంలో కళాశాల విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తుండడంతో కొంత మంది విద్యార్థినులను తరగతి గదిలో, మరి కొందరిని బయట కూర్చొబెట్టి పరీక్షలు రాయించారు. ఒక్కసారిగా వెలువడిన పొగ, దుర్వాసనతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కళాశాల ప్రిన్సిపాల్ అంబులెన్సులో 11 మంది విద్యార్థినులను జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించారు. ముగ్గురిని వెంటనే డిశ్చార్జి చేసిన వైద్యులు తొమ్మిదిని ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. అంతకుముందు కొంత మంది విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త నుంచి వెలువడిన పొగ కారణంగానే విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారని, జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు చికిత్స కోసం పంపించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత విద్యార్థినులకు ఇళ్లకు పంపించినట్లు వైద్యులు చెప్పారు.

ఖనిలో పోలీసుల విస్తృత తనిఖీలు

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, లక్ష్మీనగర్, ఓల్డ్ అశోక థియేటర్‌తో పాటు ముఖ్య కూడళ్లలో తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లక్ష్మీనగర్‌లో దుకాణాల సముదాయాల ప్రాంతంలో నిలిపి ఉన్న వాహనాలను, బస్టాండ్‌లో ప్రయాణీకుల బ్యాగులను తనిఖీ చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐలు రమేష్, భూమేష్, అనూషతో పాటు డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి, బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆసక్తిగా ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు


ఖోఖో పోటీల్లో తలపడుతున్న జట్లు

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మాస్టో ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు ఆసక్తిగా సాగాయి. పోటీలను ప్రారంభించిన ఎంఈఓ లోకిని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జీవితంలో ఓటమి, గెలుపులు సహజమని ఓటమిని గుణపాఠంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. సమయం మన కోసం మళ్లీ రాదని అవకాశాలు వచ్చినప్పుడే వాటిని వినియోగించుకుంటే జీవితంలో విజయతీరాలకు చేరుతామని అన్నారు. సాయంత్రం ముగింపు ఉత్సవాలకు హాజరైన కోరుట్ల సీఐ సురేశ్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అటు విద్యతో పాటు క్రీడల్లో బాగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

● అట్టహాసంగా క్రీడలు ప్రారంభం

జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన జట్లు హాజరుకాగా ఒలంపిక్ దీపం వెలిగించి లాంగ్ మార్చ్ నిర్వహించడంతో పోటీలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా బాలుర విభాగంలో జగిత్యాల ప్రథమ స్థానం, పెద్దపల్లి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానం, జగిత్యాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు కోరుట్ల సీఐ మెడల్స్, జ్ఞాపికలను అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ చక్రధర్, పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, పాఠశాల పీఈటీలు లంబా, మల్లేశ్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రవీందర్, క్రీడాకారులు, వివిధ పాఠశాలల పిజికల్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రఘుపతిరెడ్డి (ఫైల్)

కథలాపూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం పోసానిపేట శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో మంగళవారం లారీ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో జవిడి రఘుపతిరెడ్డి (30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం తాండ్ర్యాల శివారులో ఉన్న పొలం చూసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా దాణాతో వెళ్తున్న లారీ అతి వేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే రఘుపతిరెడ్డి మృతిచెందాడు. లారీ కల్వర్టు వద్ద బోల్తా పడగా ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు పరిశీలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి రాజరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి


కళ్యాణి (ఫైల్)

బోయినపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం మిడుమానేరు డ్యామ్ కట్ట సమీపంలో ఈ నెల 9న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామానికి చెందిన జెట్టి కళ్యాణి(25) తన మేనబావ బరిగల శ్రీశైలంతో కలిసి బైక్‌పై కొదురుపాక సమీపంలోని మిడ్ మానేరు డ్యాం కట్టపైకి వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా మెయిన్ రోడ్డుకు సమీపంలో ఎదురుగా వచ్చిన బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన కారు డ్రైవర్ మీరాల శరత్‌చంద్రరెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కళ్యాణి తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 10న రాత్రి కళ్యాణి మృతిచెందింది. మృతురాలి తండ్రి జెట్టి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

కుక్కదాడిలో ఇద్దరికి గాయాలు



కోనరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన దేవనపెల్లి కౌసల్య, లింగంపల్లి దేవయ్య లు ఇంటికి వెళుతుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామస్థులు కుక్కను చెదరగొట్టి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా వీధి కుక్కల దాడిలో చాలామంది గాయపడుతున్నారని, వాటి నుంచి కాపాడాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

నేరస్థుడికి ఏడాది జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని ఓ మహిళపై అఘాయిత్యానికి యత్నించిన కేసులో చేగుర్తికి గ్రామానికి చెందిన నిందితుడు కళ్లేపల్లి శ్రీనివాస్‌కు కరీంనగర్ కోర్టు మంగళవారం ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కళ్లేపల్లి శ్రీనివాస్ 2017లో మహిళపై అఘాయిత్యం చేయడానికి ప్రయత్నించగా సదరు మహిళ ప్రతిఘటించింది. కేకలు వేయగా చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వచ్చేసరికి నిందితుడు పారిపోయాడు. ఆ తరువాత బాధితురాలి ఫిర్యాదుతో కరీంనగర్ రురల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ పరమేశ్వర్ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీ రంజిత్ కుమార్ సాక్షులను విచారించిన అనంతరం కరీంనగర్ రెండవ అడిషనల్ జేఎఫ్‌సీఎం జడ్జి వెంకట సత్యరాజ్‌కిరణ్ పూర్వాపరాలు పరిశీలించి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

ఎల్ఎల్‌బీ విద్యార్థుల ఆందోళన


ఆందోళనకు దిగిన విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం మొదటి ఇంటర్నల్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో కళాశాలలో మొత్తం 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 40 మంది విద్యార్థులకు హాజరు శాతం లేకపోవడంతో అనుమతించలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పరీక్ష రాసేందుకు విద్యార్థులు యూనివర్శిటీలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి చేరుకున్నారు. హాజరు తక్కువ ఉన్న విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వవద్దని ముందే నిర్ణయం తీసుకున్న యూనివర్శిటీ అధికారులు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో హాజరు తక్కువ ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు అనుమతి ఇవ్వాలని, తాము పరీక్ష రాసేందుకు ఇబ్బంది ఏమిటని అధికారులను ప్రశ్నించారు. తక్కువ హాజరు ఉన్నా ఇంటర్నల్ పరీక్ష రాయవచ్చని హైకోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయని అధికారులకు వివరించారు. అనంతరం విద్యార్థులను పరీక్ష కేంద్రం బయటకు పంపించారు. ఈ విషయంలో విద్యార్థులు మాట్లాడుతూ కనీస హాజరు శాతం లేకున్నా పరీక్ష రాసే అవకాశం ఉంటుందని, అవేవీ పట్టకుండా అధికారులు తమను టార్గెట్ చేస్తున్నారని, పైరవీలతో వచ్చిన పలువురు విద్యార్థులకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు.

కాలం చెల్లిన సరుకులు వాడితే చర్యలు

- కరీంనగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన సరుకులు వాడితే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఓ బేకరీలో తనిఖీలు చేపట్టారు. కేకు తయారీలోకి ఉపయోగించే ఆరు రకాల ప్రొడక్ట్స్‌ను పట్టుకున్నారు. వాటిని ల్యాబ్‌కు తరలించనున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా అంకిత్‌రెడ్డి మాట్లాడుతూ బేకరీలు, దుకాణాలు, జనరల్‌స్టోర్స్‌లో కాలం చెల్లినవి వాడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. దుకాణదారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే వినియోగదారులు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

తన సమస్య తీర్చాలని సెల్ టవర్ ఎక్కిన యువకుడు

● కేసు నమోదు చేసిన పోలీసులు


సెల్ టవర్ ఎక్కిన బోరగళ్ల రాజు

సైదాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లికి చెందిన బోరగళ్ల రాజు అనే యువకుడు మంగళవారం సెల్ టవర్ ఎక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నచ్చ జెప్పి టవర్ దింపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. బోరగళ్ల రాజు ఇంటి వెనకాల ఉన్న భూమి కొన్ని సంవత్సరాల క్రితం సంజావ్ అనే అతడి వద్ద నుంచి లింగ స్వామి కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి బోరగళ్ల రాజు, లింగస్వామి మధ్య గొడవలు అవుతు న్నాయి. చాలా సార్లు పంచాయతీలు నిర్వహిం చారు. తన ఇంటి వెనకాల భూమి ఎలా కొంటావని లింగస్వామిని రాజు అడిగేవాడు. ఎట్టకేలకు లింగస్వామి ఆ భూమిని రాజుకు విక్రయించేం దుకు అంగీకరించాడు. ఈ క్రమంలో తన ఇంటి వెనకాల భూమి తాను అనుకున్న ధరకు ఇప్పించాలని రాజు టవర్ ఎక్కాడు. రాజును అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన కుడుముల ప్రశాంత్(33) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ ఎంబీఏ పూర్తి చేశాడు. ప్రశాంత్ తన తండ్రి శంకర్‌తో కలిసి చేపలు పట్టి అమ్మేవాడు. ప్రశాంత్‌కు కొన్ని రోజుల నుంచి మానసిన స్థితి బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రశాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెల్దిలో వృద్ధుడి అదృశ్యం


రాయమల్లు

మానకొండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్దికి చెందిన మారవేని రాయమల్లు (80) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని సీఐ సంజీవ్ తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రించారు. కుమారుడు తిరుపతి తెల్లవారుజామున లేచి చూసే సరికి తండ్రి కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



క్రీడా పోటీలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

సుల్తానాబాద్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుకోవచ్చని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 11 క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అదనపు కలెక్టర్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. జిల్లా సమన్వయకర్త మణిదీప్తి, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి కలిగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించగా, జ్యోతిబాపూలే గురుకులాల జిల్లా సమన్వయకర్త మణిదీప్తి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సంక్షేమ అధికారి సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్లతో ఆర్ఎం సమీక్ష



మాట్లాడుతున్న ఆర్ఎం రాజు

భగత్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలో డిపో మేనేజర్లతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబరులో డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. రానున్న మేడారం జాతరకు సన్నద్ధతపై చర్చించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్యాకేజీ టూర్స్ యాత్రా దానం కార్యక్రమాలపై ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి, పి .మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.నాగభూషణం, ఎస్.వెంకన్న, రవీంద్రనాథ్, విజయమాధురి, ఎం.శ్రీనివాస్, వి.శ్రవణ్ కుమార్, కె కల్పన, మనోహర్, దేవరాజు, టి.ప్రకాశ్‌రావు, శ్రీనివాస్, జి .సత్యనారాయణ, ఎ.శంకరయ్య, ఎల్.మల్లేశం, ఆర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

- ఇరుకైన గదులు.. విద్యార్థుల ఇక్కట్లు
- అద్దె భవనంలో ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ఎస్ బాలురు డిగ్రీ, జూనియర్ కళాశాల...



ఇరుకైన గదిలో బ్యాగుల మధ్య పాఠాలు వింటున్న ఇంటర్ విద్యార్థులు

అసౌకర్యాల మధ్య చదువులు

అద్దె భవనంలో కొనసాగుతున్న కళాశాల

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అభ్యసించాల్సిన గ్రామీణ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అరకొర వసతుల మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు, కిటికీలకు తలుపులు సైతం లేకపోవడంతో చలికి, దోమలకు విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. తరగతి గదుల్లో ఉదయం పాఠాలు వినడంతో పాటు అదే గదిలో రాత్రి నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ (బాలురు), జూనియర్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోంది.

● అద్దె భవనం.. అవస్థలమయం

మండల కేంద్రంలో వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అప్పటి ప్రభుత్వం 2022లో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ(బాలురు) కళాశాలను కేటాయించింది. ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని 2023 సంవత్సరం జూలైలో కళాశాల, వసతి గృహాన్ని ప్రారంభించింది. డిగ్రీ కళాశాలలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పెద్దూర్‌లోని జూనియర్ కళాశాలను అధికారులు ఇక్కడకు తరలించారు. జూనియర్ కళాశాలలో మొత్తం 79 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సరిపడా గదులు లేవు. డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో 12 గ్రూపులను కొనసాగిస్తున్నారు. ఒకే గదిలో రెండు నుంచి నాలుగు గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. జూనియర్ కళాశాలలో రెండు గ్రూప్‌లను కలిపి ఒకే గదిలో బోధిస్తున్నారు. తరగతి గదుల్లోనే విద్యార్థులు తమ వస్తువులు, దుస్తులు, పడకలను పక్కన పెట్టుకుని వాటి మధ్య పాఠాలు వినాల్సి వస్తోంది.

● విద్యార్థుల ఇబ్బందులు

డిగ్రీ, జూనియర్ కళాశాలలో చదువుతున్న 134 మంది విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయాల్సి వస్తోంది. తరగతి గదులకు కిటికీలు లేకపోవడం చలితో గజగజవణుకున్నారు. సరిపడా స్నానపు గదులు లేవు. భోజనశాల లేదు. ఇటీవల వర్షాలతో ప్రహరీ కూలి కుక్కల ఆవరణలోకి వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

- వీరప్రభాకర్, ప్రిన్సిపాల్



డిగ్రీ, జూనియర్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతుండడం వల్ల పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు సరిపడక గదిలో ఓ వైపు విద్యార్థులు కూర్చొని పాఠాలు వింటూనే రాత్రి సమయంలో డెస్క్‌లను వెనుకకు ఉంచి నేలపై నిద్రిస్తున్నారు. వసతుల కల్పనపై ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

ఒకే గదిలో పాఠాలు, పడకతో ఇబ్బందులు..

- లింగాల గిరిధర్, విద్యార్థి



నేను డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఒకే గదిలో ఉదయం పాఠాలు వింటూ రాత్రి సమయంలో నేలపై పడుకోవాల్సి వస్తోంది. చదువుకునేందుకు అవస్థలు పడుతున్నాం. తరగతి గదులు సరిపోవడం లేవు. అన్ని వసతులు కల్పించాలి.

చన్నీళ్లతో జ్వరాలు వస్తున్నాయి

- తంగళ్లపల్లి వర్షిత్, విద్యార్థి



కళాశాలలో చేరి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాను. చలి అధికమవుతున్న చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోంది. చలికి తట్టుకోలేకపోతున్నాం. చన్నీళ్ల వల్ల జ్వరం, దగ్గు, జలుబు బారిన పడుతున్నాం. వేడి నీళ్ల సమకూర్చి మా ఇబ్బందులను తీర్చాలి.

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వ్యక్తి అరెస్ట్

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వ్యక్తిని మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కోర్టు ట్రయల్‌కు గైర్హాజరవుతున్న రాఘవాపూర్‌కు చెందిన మార్కు సదానందంపై పెద్దపల్లి మేజిస్ట్రేట్ వారెంట్ జారీ చేశారని, దీంతో సదానందంను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏసీపీ కృష్ణ ఆదేశాలతో సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం సక్రమంగా హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

లారీని తప్పించబోయి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● తప్పిన పెనుప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం ఇప్పపల్లి శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద మంగళవారం ఎదురుగా వస్తున్న గ్యాస్ లారీని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. కోరుట్ల డిపోకు చెందిన టీఎస్ 21 టీ 5162 నంబర్ గల ఆర్టీసీ బస్సు 40 మంది ప్రయాణికులతో వేములవాడ నుంచి కోరుట్లకు వస్తోంది. కోరుట్ల వైపు నుంచి వేములవాడకు గ్యాస్ లోడ్‌తో లారీ ఎదురుగా రావడంతో ఒక్కసారిగా బస్సు అదుపు తప్పింది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ అయూబ్ రోడ్డు పక్కనే ఉన్న భారీ గుంతలోకి వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

రాజన్న ఆలయంలో స్ర్కాప్ తరలించేందుకు టెండర్లు

వేములవాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ భాగాలలో పేరుకుపోయిన స్ర్కాప్ తరలించేందుకు టెండర్లు నిర్వహించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నిర్వహించిన టెండర్‌లో వేములవాడకు చెందిన ఒకరు, హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు కాంట్రాక్టర్లు పాలుపంచుకున్నారు. సామగ్రిని ఐదుగురు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. స్ర్కాప్ సామగ్రి టెండర్‌లలో ఏడుగురు కాంట్రాక్టర్‌లు చర్చించుకొని ఒక్కో సామగ్రిని ఒక కాంట్రాక్టర్ కైవసం చేసుకున్నారు. టెండర్‌లలో ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్, ఈఈ రాజేష్, డీ మహిపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరెందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న నిత్య కల్యాణంలో చిరిగిన చీర

● ఈనెల 3న పొందిన దంపతులు

వేములవాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్య కల్యాణంలో చిరిగిన చీర ప్రత్యక్షమైంది. గత సోమవారం కల్యాణం చేయించుకున్న భక్తులకు చిరిగిన చీర వచ్చింది. అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంనకు ఆర్జిత సేవలు మార్చిన సందర్భంగా నిత్య కల్యాణం, శాశ్వత కల్యాణాలు అన్నదానసత్రం పైఅంతస్తులో కొనసాగుతున్నాయి. ఈనెల 3న కరీంనగర్‌లో ఉంటున్న నూతన దంపతులు శ్రీలత, శ్రీపతి కల్యాణం చేయించుకున్నారు. వీరికి సమర్పించిన చీరను ఇంటికి వెళ్లాక చూసుకునే సరికి చీకుపట్టి చిరిగిపోయి ఉంది. చీరను చూసి ఆ దంపతులు ఆందోళన చెందారు. చీరలను దేవస్థానంనకు



భక్తులకు అందిన చిరిగిన చీర

టెస్కో నుంచి సరఫరా అవుతాయి. ప్రతి చీరకు రూ.300 బిల్లు ఆలయం ద్వారా చెల్లిస్తారు. అయితే నాసిరకం చీరలను సరఫరా చేయడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చీరను చూసి ఆవేదన చెందాం

- శ్రీలత, శ్రీపతి దంపతులు, కరీంనగర్

తాము ఈ నెల 3న శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నాం. అనంతరం రెండు టికెట్లు తీసుకొని కల్యాణం చేయించుకున్నాం. ఇంటికి వెళ్లాక చీరను చూసే సరికి చిరిగి ఉంది. దీంతో చాలా ఆవేదన చెందాం. నాసిరకం చీరె ఇవ్వంపై ఆలయ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

మరోసారి కాకుండా చూస్తాం

- బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈవో

కల్యాణంలో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం. కల్యాణం అనంతరం భక్తులకు ఇచ్చే చీరను పరిశీలించాకే భక్తులకు అందజేస్తాం. చిరిగిన చీరను మార్చి కొత్త చీర ఆ భక్తులుకు ఇస్తాం.

ఏటీసీతో ఉపాధి అవకాశాలు

● ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

తంగళ్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని ఏటీసీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మొత్తం ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ అడగగా 166 మంది చదువుతున్నట్లు వివరించారు. వివిధ కోర్సుల ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లడుతూ యువత ఏటీసీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని లోతుగా తెలుసుకోవాలని, ప్రాక్టికల్‌గా కూడా నిత్యం సాధన చేయాలని సూచించారు. ఈ దశలో నేర్చుకున్న అంశాలు ఉద్యోగానికి, వృత్తి జీవితంలో ఉపయోగపడుతాయని తెలిపారు. సమయాన్ని వృథా చేసుకోవద్దని తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, తహసీల్దార్ జయంత్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, పదోతరగతి విద్యార్థుల ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్ ప్రకాష్ తెలిపారు. దరఖాస్తులు www.tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు ప్రయాణం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై వాహనాలు

మల్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి వద్దకు చేరుకునే ఘాట్‌రోడ్డుపై ప్రతి మంగళ, శనివారాల్లో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి. సమక్క, సారక్క జాతరకు ముందు వేలాది భక్తులు వందలాది వాహనాల్లో కొండగట్టుకు వస్తున్నారు. దీంతో వాహనాలను ఘాట్‌రోడ్డుకిరువైపులా రాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు అలాగే ఉంచుతుండడంతో రోజంతా కొండపైకి వచ్చే భక్తుల వాహనాలకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. వైజంక్షన్ వద్ద మూడు మార్గాల్లో వెళ్లే వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఘాట్‌రోడ్డు నుంచి కొండపైకి వాహనాలు ఎక్కాలన్నా, దిగాలన్నా పద్మవ్యూహం చేధించినట్లు అవుతుందని వాహనాల డ్రైవర్లు పేర్కొంటున్నారు. వాహనాలను ఘాట్‌రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనం కోసం బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు.

అంజన్న సన్నిధిలో సుప్రభాత సేవ

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 15నుంచి నూతనంగా ప్రవేశపెట్టనున్న సుప్రభాత సేవ సాధ్యాసాధ్యాలను మంగళవారం దేవస్థానం అధికారులు పరిశీలించారు. సేవలో పాల్గొనడానికి ఇద్దరికి అవకాశం ఉండగా టికెట్ రుసుము రూ.వెయ్యి. మంగళవారం భక్తులు 12 టికెట్లు కొనుగోలు చేశారని సుప్రభాత సేవ కార్యక్రమం విజయవంతం అయినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సేవ ద్వారా భక్తులకు స్వామి వారి మొదటి దర్శన సౌకర్యంతో పాటు దేవస్థానం తరపున ఒక కండువా, రెండు కనుములు, స్వామి వారి 400గ్రాములు అభిషేక లడ్డూ అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్‌తో పాటు ఆలయ అర్చకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు. అయితే సుప్రభాత సేవ టికెట్ ధర అధికంగా పెట్టారని దీనిపై ఇద్దరికి కాకుండా కనీసం నలుగురి నుంచి ఐదుగురికి అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



కొండగట్టులో భక్తులు



బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తులు

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

వేములవాడ టౌన్ : కార్తీకమాసం సందర్భంగా వేములవాడ బద్దిపోచమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. కార్తీక మాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రమణ్యశర్మ, జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలు, పెద్దలపై తీవ్ర ప్రభావం

- నివారించగల అంటు వ్యాధి న్యుమోనియా
- నేడు ప్రపంచ న్యుమోనియా దినోత్సవం



సుభాష్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతి వెయ్యి మందిలో 11 మంది న్యుమోనియా బారిన పడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. న్యుమోనియాపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం నవంబరు 12న ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 60 సంవత్సరాలపైన వారికి రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వారు న్యుమోనియా బారిన పడేందుకు అవకాశం ఉం టుంది. న్యుమోనియా నివారించగల, చికిత్సతో నయం చేసే అవకాశం ఉన్న అంటు వ్యాధి. ఈ వ్యాధిని త్వరగా గుర్తిస్తే నివారించ వచ్చు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. న్యుమోనియా, ఇతర శ్వాసకోశ అంటూ మరణాల సంఖ్య గత కొన్ని సంవత్సరాలలుగా పెరుగుతూ వస్తోంది.

● ఈ సంవత్సరం థీమ్ 'పిల్లల మనుగడ'

ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సంద ర్భంగా ఈ సంవత్సరం పిల్లల మనుగడ అనే థీమ్‌ను తీసుకున్నారు. పిల్లల మరణాలనికి ప్రధాన కారణంగా న్యుమోనియాను గుర్తించారు. మంచి పోషకాహారం, స్వచ్ఛమైన గాలి, టీకాలు, యాంటి బయాటిక్స్ అందించడం ద్వారా న్యుమోనియాను తగ్గించవచ్చు. సకాలంలో రోగ నిర్ధారణ చేస్తే వ్యాధిని త్వరగా అరికట్టవచ్చు. న్యుమోనియా సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లగాలులు, వాతవరణ కాలుష్యం, గాలి, దుమ్మూ ధూళిపై జాగ్రత్తగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించాలి.

టీకాలు అందుబాటులో ఉన్నాయి..

- డాక్టర్ రవీంద్రాచారి, పల్మనాలజిస్టు



న్యుమోనియా నివారించదగ్గ వ్యాధి. సకాలంలో గుర్తించి డాక్టరును సంప్రదిస్తే చికిత్స అందించి వ్యాధిని నయం చేయవచ్చు. ఇపుడు పూర్తిగా నయమయ్యే టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ టీకాలు తీసుకుంటే వ్యాధిని తగ్గించవచ్చు. ఇందులో రెండు రకాలు ఉంటాయి. డాక్టర్ సూచన మేరకు టీకాలు తీసుకోవాలి.

ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట రైతులు



సదస్సుకు వెళ్లిన రైతులు

కోనరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల రైతులకు అరుదైన అవకాశం దక్కింది. జర్మనీలో మంగళవారం ప్రారంభమయ్యే ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాతు బండ శ్రీనివాస్, కాటిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు సోమవారం బయలుదేరి జర్మనీకి వెళ్లారు. ఈ సదస్సులో మంగళవారం ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు సుస్థిర సాగు విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు చర్చించినట్లు రైతులు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎలిగేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ధూళికట్ట ఉన్నత పాఠశాలకు చెందిన నాగ చైతన్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యాడు. ఈ నెల 10న గర్రెపల్లిలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతికి చెందిన జెల్లి నాగచైతన్య అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్‌ను, విద్యార్థిని పాఠశాల హెచ్ఎం బిజిలి సదయ్య, అభినందించారు.



నాగచైతన్య

స్విమ్మింగ్‌లో రాష్ట్రస్థాయికి...



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ముత్తారం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ముత్తారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17విభాగంలో ఎంపికయ్యారు. ఇందులో ఫ్రీ స్టైల్‌లో మోక్షిల్, బ్యాక్ స్ట్రోక్‌లో శశికుమార్ ఎంపికయారు. వీరు ఈనెల 13న వికారాబాద్ స్విమ్మింగ్ అకాడమీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ప్రధానోపాధ్యాయులు పద్మాదేవి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పద్మాదేవి, పీడీ వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యాస రచన పోటీలో...

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలకు చందనాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని హాసిని ఎంపికైంది. జిల్లా కేంద్రంలో జరిగిన వ్యాస రచన పోటీల్లో హాసిని ప్రథమ స్థానంలో నిలిచింది. పదో తరగతి చదువుతున్న హాసిని రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికపై రామగిరి మండల విద్యాధికారి కొంరయ్య, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పొలాలను సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఎలిగేడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్ దేవుపల్లిలో ఏరువాక కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం రైతు నునుగొండ అంజయ్య పొలంలో ఏర్పాటు చేశారు. కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం అందించిన చిరుసంచుల దశలో ఉన్న కేఎన్ఎం 7715 రకం పంటను పరిశీలించి, రైతులకు విత్తనంలో పాటించాల్సిన మెలకువలు, విత్తనోత్పత్తి గురించి వివరించారు. ఏఈఓ సురేష్, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి భగవద్గీత కంఠస్థ పోటీలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ధర్మాచార్యుల నరేడ్ల సదయ్య తెలిపారు. ఇందులో 12 నుంచి 40 ఏళ్ల లోపు వారు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9849764534 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఉన్నత పాఠశాలలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్‌గా సతీష్

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్‌గా రంగంపల్లికి చెందిన కొండి సతీష్‌ను నియమించినట్లు జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. మంగళవారం సతీష్‌కు నియామకపత్రం అందజేశారు. వైస్ చైర్మన్ సతీష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా బీసీలను సంఘటితం చేస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో వైస్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన రాష్ట్ర బీసీ జేఏసీ నాయకులు ఆర్. కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా చైర్మన్ ఉషలకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఉష

నిరసనను విజయవంతం చేయాలి

ఓదెల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసే వరకు నిరసన కార్యక్రమాలు ఆగవని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రాసపల్లి రవికుమార్ తెలిపారు. కొలనూర్‌లో మంగళవారం సీజేపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 17న, ఢిల్లీలో నిర్వహించే నిరసనలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎంఎస్‌పి మండల ఇన్‌చార్జి పల్లె సుమన్, నాయకులు సాతూరి నరేష్, సాతూరి సందీప్, పల్లె మధు, మాటూరి నర్సయ్య, పల్లె సూర్య కిరణ్, గోశిక స్వామి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకలో ఇటీవల ఆవుల పెద్దరాజయ్య మృతి చెందగా మంగళవారం మృతుడి కుమారుడు బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ ను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. అలాగే అతని తండ్రి మృతికి కారణాలను తెలుసుకున్నారు. చిత్రపటానికి నివాళులర్పించారు.

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరంగల్‌లో గురు షాటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోదావరిఖనికి చెందిన డ్రాగన్ షాటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. సీనియర్ బాలుర బ్రౌన్‌బెల్ట్ స్పారింగ్, కటా విభాగంలో టింగు, జయసాయి చరణ్ బంగారు పతకం సాధించారు. జూనియర్, సబ్ జూనియర్ కటా స్పారింగ్ విభాగాల్లో పలువురు విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. టోర్నమెంట్‌లో ఓవరాల్‌గ్రాండ్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను డబ్ల్యూఎఫ్ఎస్‌కెఓ తెలంగాణ చీఫ్ చంద్రశేఖర్ అభినందించారు.

వీధి దీపాల ఏర్పాటు

పెద్దపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గోదాంలకు వెళ్లే దారిలో వీధి దీపాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మంగళవారం కార్యదర్శి తూముల రవి వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

కారు బాంబు ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

కళ్యాణ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రవాదుల బాంబు పేలుడును వ్యతిరేకిస్తూ మంగళవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో ఎస్సీ మోర్చా నాయకుడు జక్కుల నరహరి ఆధ్వర్యంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేష్, అసెంబ్లీ కన్వీనర్ కొండపర్తి సంజీవ్ మాట్లాడుతూ దేశానికి ఉగ్రవాదం పెను ప్రమాదమని, ఉగ్రవాదుల చర్యలను సహించేది లేదన్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేస్తున్న నేపథ్యంలో ఉగ్రవాదులు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారన్నారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు సుల్వ లక్ష్మీనర్సయ్య, నర్సింహారెడ్డి, రాకేష్, సునీల్, నిఖిల్, విశాల్, రమేష్, శివ, శ్రీనివాస్‌యాదవ్, సతీష్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పేలుళ్లను నిరసిస్తూ కొలనూర్‌లో బీజేవైఎం నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల ఆదేశాల మేరకే ఇక్కడ పేలుళ్లకు పాల్పడి అమాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్, పుల్ల సదయ్య, రజనీకర్, మధునయ్య, రాజు, నవీన్, సాయికుమార్, సారయ్య పాల్గొన్నారు.



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల పిరికిపంద చర్యలను ఖండిస్తూ మంగళవారం రాత్రి బీజేపీ మహిళా నేత కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను ఎన్టీపీసీ మేడిపల్లి చౌరస్తా వద్ద దహనం చేశారు. సంధ్యారాణి మాట్లాడుతూ మారణకాండలు, బాంబుదాడులు, అల్లర్లతో దేశ అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. ముష్కరుల ప్రతి కుట్రను మోదీ ప్రభుత్వం తిప్పి కొడుతుందన్నారు. గాండ్ల ధర్మపురి, ఎన్టీపీసీ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్ కుమార్, ఇదునూరి చిరంజీవి, చిలువేరు అంజి, లింగరాజు, ఈదునూరి శ్రీకాంత్, సాహూ సంతోష్, సంతోష్ రెడ్డి, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కారుబాంబు పేలుడులో మృతి చెందిన వారికి పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. క్యాండిల్స్ చేత పట్టుకుని రాజీవ్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. కారుబాంబు పేలుడు ఘటనను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు నిర సన వ్యక్తంచేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకో వాలన్నారు. బీజేపీ ఎల్లప్పుడు దేశ భద్రత, ప్రజల శాంతి, ఐక్యతను కోరుకుంటుందన్నారు.

దుర్గామాత విగ్రహం తరలింపు

జ్యోతినగర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సోలార్ ప్రాజెక్టు సమీపంలో లభ్యమైన దుర్గామాత విగ్రహాన్ని నరసాలపల్లి వాసులు మంగళవారం గ్రామానికి తరలించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

దుర్గామాత విగ్రహం తరలింపుపై హిందూ ఐక్యవేదిక నాయకులు నిరసనలు తెలిపారు. ఇనంపల్లి వెంకన్న, మండల సమ్మన్న, రాకేష్, సంజీవ్ కుమార్, వెంకటేష్, సంతోష్ రెడ్డి, కందుల సంధ్యారాణి, గాండ్ల ధర్మపురి తదితరులు మాట్లాడుతూ దేవతల ప్రతిమ లభ్యమైతే కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని, అలా చేయకుండా విగ్రహాన్ని మరోచోటికి తరలించడం సరైన పద్ధతి కాదన్నారు. ఎన్టీపీసీ స్థలంలోనే దుర్గామాత ఆలయాన్ని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో మల్లేశం

కోల్‌సిటీటౌన్, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఉర్దూ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గంగానగర్‌లోని ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి మండల విద్యాధికారి జింక మల్లేశం హాజరై పూర్వ ప్రాథమిక పాఠశాలను, పరేడ్ బ్యాండ్ లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని, మహ్మద్ ఇక్బాల్ జయంతి సందర్భంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నికిత్ ఫాతిమా, ఎస్ఎంసి చైర్మన్ సద్దాం హస్సేన్, ఎపీసీ చైర్మన్ పరిపూర్ణ, నీలిమా, స్పోర్ట్స్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్, ఉపాధ్యాయులు, సీనియర్ పాత్రికేయుడు పి.రాజలింగం, పోషకులు పాల్గొన్నారు.

విశ్వభారతి విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం



బాలల దినోత్సవ వేడుకల్లో వేషధారణలో విద్యార్థులు

జ్యోతినగర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విశ్వభారతి నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాలల విద్యార్థులు బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నవోదయ పాఠశాలలో నిర్వహించిన వేడుకలను పాఠశాల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, సెయింట్ జోసెఫ్ హెచ్ఎం నోయల్ జోసెఫ్, నవోదయ హెచ్ఎం తిరుపతి గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొని ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలను చేసి మొదటి రోజు డ్రాయింగ్, క్రాఫ్ట్, స్టోరీ టెల్లింగ్ క్లే మౌల్డింగ్, స్పీడ్ రీడింగ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలల దినోత్సవం పేరిట నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. ఇందులో సుమారు 20 అంశాలపైన పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి పాఠశాలలో వివిధ కార్యక్రమాల రూపకల్పన చేసినట్లు తెలిపారు. అలాగే బుధవారం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో నిర్వహిస్తామని, 13, 14న విశ్వభారతి పాఠశాలలో వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు.

అందెశ్రీ మరణం సాహితీలోకానికి తీరని లోటు



అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా కవి అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్య లోకానికి తీరని లోటని రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. మంగళవారం గోదావరిఖని చౌరస్తాలో బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేష్ ఆధ్వ ర్యంలో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ గీతంతో ప్రజల్లో ఆత్మగౌరవ జ్యోతిని వెలి గించారని, అందెశ్రీ గొంతు తెలంగాణ ఆవిర్భావానికి ప్రాణం పోసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కళాకారులకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. మాజీ మేయర్ బంగి అనీల్‌కుమార్, నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, దూళికట్ట సతీష్, కొప్పుల శంకర్, ముస్తాఫా, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గేయ రచయిత ప్రముఖ కవి అందెశ్రీ మృతికి పట్టణ జేఏసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. షిర్కే చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జేఏసీ చైర్మన్ టంగుటూరి రాజయ్య మాట్లాడారు. ఉద్యమ కారుడు అందెశ్రీ మృతి తెలంగాణకు తీరని లోటన్నారు. అయిలి శ్రీనివాస్, కళాధర్‌రెడ్డి, సాగంటి శంకర్, కిషన్‌రెడ్డి, మూకిరి రాజు, మేడి సదానందం, రాజమౌళి, పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించడంపై శిక్షణ



అధికారులకు వివరిస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్

జ్యోతినగర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగులకు దైనందిన జీవితంలో ఒత్తిడిని జయించడం, ఆశావాద దృక్పథంపై యాజమాన్యం ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. ఎన్టీపీసీ ఈడీసీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం చెందిన డాక్టర్ ఉమా, రజని, శోభ, ప్యాకల్టీతో ఉద్యోగులు, అధికారులకు వ్యక్తిగత అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత ప్రాజెక్టుకు చెందిన హెచ్‌ఓడీలకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. వృత్తి వ్యవహారాలను వ్యక్తిగతంగా అధికారులు సమర్థవంతంగా పని చేయడానికి సంబంధించి ఈడీ అధికారులకు విషయబోధన చేశారు. రెండు రోజుల శిక్షణలో పలు అంశాలపై గ్రూప్ డిస్కషన్, ప్రజెంటేషన్ నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో ధర్మారం క్లబ్ అధ్యక్షుడు ఇప్ప మల్లేశం, ప్రోగ్రాం చైర్మెన్ తన్నీరు రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. టెక్నీషియన్ ప్రభాకర్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమున్న వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. ఇంచార్జ్ తహసీల్దార్ ఉదయ్ కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మండల వైద్యాధికారి అనుదీప్ లు లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ సభ్యులు ఎల్లారెడ్డి, మునీందర్ రెడ్డి, రవి,, చంద్రకాంతరెడ్డి, రవి, రవీందర్ శెట్టి, నాడెం శ్రీనివాస్, నర్సింగం, భూదారపు మహేందర్, ముజాహిద్, కుమార్, పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

ధర్మారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరిపించడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. మంగళవారం లంబాడి తండా (బి) లంబాడి తండా (కె) గ్రామాలలో జెండర్ స్పెషలిస్ట్ సుచరిత బాల్యవివాహలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2006 గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు. 18 సంవత్సరాలు నిండక ముందు పెళ్లి చేసుకుంటే వాటి వల్ల జరిగే శారీరక, మానసిక అనర్థాల గురించి తెలిపారు. ఆడపిల్ల పుట్టడం, బతకడం, ఎదగడం, చదవడం నినాదాన్ని పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ బ్లాండీన, ఉపాధ్యాయులు సునిత, శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్స్ స్వాతి, లలిత, ఆశ వర్కర్స్ సరస్వతి, శోభ, తిరుమల, పంచాయితి సెక్రెటరీలు కిరణ్ కుమార్, సత్యనారాయణ, ఏఎన్ఎం కరుణ, శ్యామల పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



భూపతిపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

సుల్తానాబాద్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు ప్రారంభించారు. గర్రెపల్లి, భూపతిపూర్, సాంబయ్యపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రారంభించినట్లు తెలిపారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జానీ, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు బల్మూరి వెంకట రమణారావు, సత్యనారాయణరావు, రమేష్ గౌడ్, మాదాసు వెంకన్న, పులి వెంకటేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బక్కయ్య, రాజిరెడ్డి, శ్రీనివాస్, చక్రధర్, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రా ల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అప్ప న్నపేట సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్ అన్నారు. మంగళవారం సబ్బితం, కుర్మపల్లి , మేరపల్లి, బొంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. సీఈవో తిరుపతి, మాజీ సర్పంచ్ చంద శంకర్, గుర్రాల రాజు, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ భూములను పరిశీలించిన లోకాయుక్తా

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ పటేల్ ఫిర్యాదు మేరకు మంగళవారం లోకాయుక్త ప్రతినిధి, దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు ఆలయ భూములను పరిశీలించారు. సరిహద్దుల్లో ఉన్న భూ యజమానులు గ్రామస్తుల సమక్షంలో భూములున్న పరిస్థితులను తెలుసుకున్నారు. లోకాయుక్త పతినిధి నరసింహ చారి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ, సత్యనారాయణ శంకర్, రాజ్‌కుమార్, గంగయ్య, రాజయ్య పాల్గొన్నారు.



సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జీఎం

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న సైబర్ సెక్యూరిటీ, సైబర్ జాగృత్ భారత్ అంశాలపై హెచ్‌ఆర్‌డి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. సిఎన్‌సిఓపిఏ క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్జీ-3, ఏపిఏ జీఎం సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు హాజరై ప్రారంభించారు. కార్పోరేట్ ఐటి విభాగం డిజిఎం శ్రీనివాస్‌రావు, ఐటి మేనేజర్ డిఎస్ నానపెర్నాన్ వీస్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వార సైబర్ సెక్యూరిటీ, సైబర్ జాగృత్ భారత్ అంశాల పై అవగాహన కల్పించారు. అధికారులు శేఖర్‌బాబు, రామ్మోహన్, బండి సత్యనారాయణ, రాజేశ్వరి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై చర్చ



సమావేశంలో పాల్గొన్న అధికారులు, యూనియన్ నాయకులు

గోదావరిఖని, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ (జేసీసీ) సమావేశం జరిగింది. ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు నరసింహరెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, కాంపల్లి సమ్మయ్య, శంకర్‌రావు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి అంశాలపై చర్చించారు. సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంతింటి కల సాధనకు ప్రణాళిక రూపొందించి అమలు చేయడం, పెర్క్స్‌పై ఆదాయ పన్నును యాజమాన్యమే భరించేలా చర్యలు చేపట్ట డం, మారుపేర్ల విజిలెన్స్ సమస్యలను పరిష్కరించడం, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుపై చర్చించారు. సెక్యూరిటీ గార్డ్స్‌ను సెక్యూరిటీ కాని స్టేబుల్‌గా డిజిగ్నేషన్ మార్పు, స్టాఫ్‌నర్స్ డిజిగ్నేష న్‌ను నర్సింగ్ ఆఫీసర్‌గా, ప్రమోషన్ పాలసీ క్యాడర్ స్కీమ్ పునర్నిర్మాణం, డిస్మిస్ ఉద్యోగులకు మరో అవకాశం కల్పించటంపై చర్చించారు. ఈ అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకునేలా యాజమాన్యం, ప్రభుత్వం దృష్టి సారించాలని జనక్ ప్రసాద్ కోరారు.

కోల్‌కారిడార్ విస్తరణ పనులను పరిశీలించిన సివిల్ జీఎం

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ సెంటినరీకాలనీ నుంచి 8ఇంక్లైయిన్ కాలనీ వరకు ఏర్పాటు చేసిన కోల్‌కారిడార్ విస్తరణ పనులను మంగళవారం సివిల్ జీఎం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఫోర్‌లైన్ పనులకు బడ్జెట్ కేటాయింపు చేపట్టే వరకు తాత్కాలిక రోడ్ వేయడానికి సన్నాహాలను ప్రారంభిస్తున్నారు. ఐటి మంత్రి శ్రీధర్‌బాబు సింగరేణి ఉన్నతాధికారులతో మాట్లాడిన నేపథ్యంలో పనులను ప్రారంభించనున్నట్లు తెల్సింది. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోటరవీందర్‌రెడ్డి జీఎంను సత్కారించారు. సత్వారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కులాంతర వివాహాలకు ప్రోత్సాహమేది!

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తులను ప్రతీ ఆరుమాసాలకోకసారి ఎస్సీ కమీషన్ సమీక్ష చేసి ఆర్థికసాయం మంజూరు కోసం సిఫారసు చేస్తారు. దీంతో ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసి వెంటనే ఆ సహాయాన్ని లబ్ధిదారులకు అందిస్తారు. ఈ పథకం ద్వారా మొదట 3 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించగా, ఆ తర్వాత 1993లో మూడు వేల నుంచి పది వేల రూపాయల వరకు ఆర్థిక సహాయాన్ని పెంచారు. ఈ సహాయం ఏ మాత్రం సరిపోవడం లేదని దళిత సంఘాలు ఆయా ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చాయి. దీంతో 2019లో అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభు త్వం ఆర్థిక సహాయం ఏకంగా రెండు లక్షల 50 వేల రూపాయలకు పెంచింది. బీసీ సంక్షేమ శాఖ ద్వారా కేవలం 10 వేల ఆర్థిక సహాయాన్ని మాత్రమే అందిస్తున్నారు. ఈ శాఖ ద్వారా ఇచ్చేది తక్కువే అయినప్పటికీ బడ్జెట్ సకాలంలో విడుదల చేయడం లేదు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం పర్యటించనున్నారు. మంథని, రామగిరి మండలంలోని బేగం పేట, పోచమ్మవాడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం, పాఠశాల మరమ్మతుకు శంకుస్థాపన, మంథని గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సిం థటిక్ షటిల్ కోర్టు ప్రారంభం, టీ-వర్క్స్ సంబంధించి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తారు. అడవిసోమన్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొని, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు.

చిత్రలేఖనంతో నివాళి



జూలపల్లి, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన చిత్రకారుడు, కవి,రచయిత గుండు రమణయ్యగౌడ్ చిత్రలేఖనం ద్వారా ప్రముఖ కవి, రచయిత అందెశ్రీకి నివాళులర్పించాడు. రాష్ట్ర ప్రజలంతా కన్నీరు పెడుతున్నట్లు, రెండు చేతులతో పుష్పాలను చల్లుతున్నట్లు కవి మరణించిన అతని పాటల జ్ఞాపకాలు ప్రజల హృదయాలలో దీపమై వెలుగుతున్నట్లుగా చిత్రించాడు. అలాగే ఢిల్లీ ఎర్రకోట దగ్గర కారు బాంబు పేలుడు దృశ్యాలను, భారతదేశం పటం, శాంతి పావురం మరణించిన వారికి నివాళులు అర్పిస్తున్నట్లుగా చిత్రీకరించారు.

అధికారులను సన్మానించిన నాయకులు

కమాన్‌పూర్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రియాంక, ఎంపీఓ సౌమ్యలను మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ సమావేశంలో వారికి శాలువాలు కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, ఆకుల గట్టయ్య, కొండ వెంకటేష్, కొట్టె భూమయ్య, రాచకొండ రవి, పెండ్లి నారాయణ, పల్లె నారాయణ పాల్గొన్నారు.

మండల బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నియమితులైన పోలుదాసరి సాయికుమార్‌ను బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో అంగడి బజార్‌లో శాలువాతో సన్మానించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, ఆకుల గట్టయ్య, కొండ వెంకటేష్, కొట్టె భూమయ్య, పాల్గొన్నారు.

రామేశ్వరానికి బస్సు ప్రారంభం

కళ్యాణ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి రామేశ్వరానికి ఐదు రోజుల ప్రత్యేక సర్వీసును మంగళవారం ఖని ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. బస్సు కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, కరుంగలిమాల, మధురై, రామేశ్వరం, కంచి, జోగులాంబ శక్తి పీఠం వెళుతుందని తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక రౌండ్ ట్రిప్ యాత్రలను ఏర్పాటు చేశామని, మురుండేశ్వర్, గోకర్ణ, గోవ, కుకి సుబ్రహ్మణ్యస్వామి, ఉడిపి, ధర్మశాల, షిరిడీ, ప్రయోగ్‌రాజ్, కాశీ, అయోధ్యకు బస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు.